

రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

# బురద రోడ్లపై వెళ్లేదెలా?

- విద్యార్థులు, గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు
- వరినాట్ల వేసి మహిళల నిరసన



బురదలో నుంచి పాఠశాలకు పిల్లలు

ఇనుగుర్తి, జూలై 27 : అడుగు తీసి అడుగు వేయలేక గ్రామస్తులు, ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఇలా రోజూ ఇబ్బంది పడాల్సి వస్తోంది. చిన్న వర్షానికే బురదమయమైన ఈ రోడ్డు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం లాలు తండా జీపీలోని రూప్లాతండాలోనిది. దీంతో విసుగుచెందిన స్థానిక మహిళలు శనివారం బురద రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ తండాకు రూ.45 లక్షలతో బీటీ రోడ్డు మంజూరు చేసినా కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టి తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇలా బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారిందని సర్పంచ్ రామన్ననాయక్ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరారు. నిరసనలో తండావాసులు ధరావత్ సీత, నీలమ్మ, కవిత, శంకర్, నిమ్మ, భిక్షపతి పాల్గొన్నారు.

# ఆధార్ అప్‌డేట్ పేర మోసం

- రూ. 1.80 లక్షల కాజేసిన దళారీ
- కోర్టు ఆదేశాలకు బాధితులకు డబ్బుల చెల్లింపు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 27 : ఆధార్ అప్‌డేట్ చేస్తామని నమ్మబలికిన దళారీ బాధితుల బ్యాంకు ఖాతాల ద్వారా కాజేసిన డబ్బులను చివరికి కోర్టు ఆదేశాలతో ఇప్పించిన ఉదంతం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల నమిలిగొండలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. 1 జూలై 2019లో మహబూబాబద్ జిల్లా నెక్కొండకు చెందిన ఓ వ్యక్తి ఆధార్ అప్డేట్ చేస్తానంటూ నమిలిగొండకు వచ్చాడు. తన పేరు ఆవుల వినయ్‌కుమార్, జనగామలోని కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చానని నమ్మబలికాడు. డిజిటల్ ఇండియా, డిజిటల్ విలేజేస్ పేరుతో ఐడీ కార్డు చూపాడు. దీనిని నమ్మిన నాటి స్థానిక సర్పంచ్ డ్యాగల ఉప్పలస్వామి గ్రామంలో టాంటాం చేయించారు. నిజమేనని నమ్మిన గ్రామస్తులు మూడు రోజుల పాటు బయోమెట్రిక్ మిషన్ ద్వారా వేలు ముద్రలు వేశారు. దీంతో వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.300, రూ. 600, రూ. 800, రూ.1000, రూ.1500 చొప్పున డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. అనుమానం వచ్చిన గ్రామస్తులు బ్యాంకు వద్దకెళ్లి తెలుసుకోగా ఆధార్ అప్‌డేట్ కాదు, మిమ్మల్ని మోసం చేశాడని అధికారులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వినయ్‌కుమార్ గ్రామం నుంచి పరారయ్యాడు. గ్రామంలో 285 మందికి చెందిన బ్యాంకు ఖాతాల నుంచి రూ. 1.80 లక్షలు డెబిట్ అయ్యాయి. ఈ డబ్బులు నెక్కొండకు చెందిన యూనియన్ బ్యాంకు (ఆంధ్రా బ్యాంకు ) ఖాతాలో జమయినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. తమ గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై స్థానిక మాజీ ఎంపీటీసీ పులి యాకయ్య బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు పూర్తి వివరాలను జనగామలోని కోర్టుకు సమర్పించారు. విచారణ జరిపిన కోర్టు బాధితులకు వినయ్‌కుమార్ నుంచి రూ.1.80 లక్షల రూపాయలను చెల్లించాలంటూ ఇటీవల తీర్పు ఇచ్చింది. దీంతో శనివారం పులి యాకయ్య ఆధ్వర్యంలో బాధితులకు డబ్బులు చెల్లిస్తున్నారు.



బాధితులకు డబ్బులు ఇప్పిస్తున్న ఎంపీటీసీ యాకయ్య

**బాధితులకు డబ్బులు ఇప్పిస్తున్నాం : పులి యాకయ్య, మాజీ ఎంపీటీసీ**

ఆధార్ కార్డు అప్‌డేట్ పేర నమిలిగొండ గ్రామస్తులను మోసం చేసిన వినయ్‌కుమార్ నుంచి బాధితులకు డబ్బులు ఇప్పిస్తున్నాం. బయోమెట్రిక్ ద్వారా వేలు ముద్రలు వేయించుకుని వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.80 లక్షలు కాజేశాడు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, జనగామ కోర్టులో విచారణ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మోసం చేసిన వ్యక్తి నుంచి బాధితులకు డబ్బులు ఇప్పిస్తున్నాం.

















